క్లుప్తంగా

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఫిజియో థెరపీ చికిత్సను పరిశీలిస్తున్న సీఎంఓ

పెద్దాపురం: వివిధ ప్రతిభావంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీఎంఓ చామంతి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్ సేవలను మంగళవారం ఆయన పరిశీలించి ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం అక్కడ ఫిజియో థెరపీ సేవలను, రికార్డులను పరిశీలించారు. భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, ఫిజియో థెరపీ వైద్యులు అపర్ణ, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి ఆర్థిక సాయం



సత్యనారాయణకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కొత్తపల్లి: స్థానిక వీవీఎస్ పాఠశాల వెనక కాలనీలో ఉంటున్న చేనేత కార్మికుడు కాకి సత్యనారాయణ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం కాకినాడకు చెందిన భరోసా ఫౌండేషన్ రూ.10 వేలు, వైభోగుల కృష్ణ, బీసీ సెల్ మండలాధ్యక్షుడు గింజల శ్రీనివాస్‌లు రూ.5 వేలు సమకూర్చారు. మంగళవారం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో రూ.15 వేలు ఆర్థిక సాయం ఆయనకు అందించారు.

పనులపై పర్యవేక్షణ తప్పనిసరి

కొత్తపల్లి: పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను ప్రధానోపాధ్యాయులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు తప్పనిసరిగా పర్యవేక్షించాలని మండల ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని మూలపేట జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. రోజూ ఎంతమేర పనులు జరుగుతున్నాయో పర్యవేక్షించాలని అక్కడి సిబ్బందికి సూచించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్య పరిరక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి

పెద్దాపురం: నిత్యం గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్య పరిరక్షణ సాధ్యపడుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక పాత పెద్దాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మహోత్సవంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తులసీ, హేమలత, ఆయాలు కృపామణి, జయ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రహదారులు జలమయం

కొత్తపల్లి: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో ఇరువైపులా ఉన్న డ్రెయిన్‌లను ఆక్రమించి షాపులను ఏర్పాటు చేయడం వల్ల వర్షపునీరు పోయే దారి లేక సుమారు మోకాలు లోతు వరకూ నీరు నిలిచిపోయింది. వాకతిప్ప పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉప్పాడ–పిఠాపురం రోడ్డులో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ముగ్గురికి పదోన్నతి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీరామ్‌కు ఈవో పీఆర్డీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఆయనతో పాటు కాకినాడ జిల్లాలోని అన్నవరం, ధర్మవరం గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు ఈవో పీఆర్డీగా పదోన్నతి లభించింది.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

కరప: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, సీహెచ్ఎన్‌ఓలు, సూపర్‌వైజర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పీహెచ్‌సీలలోనే డెలివరీలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులకు ఆదర్శం సర్వేపల్లి

- నియోజకవర్గంలో ఘనంగా గురుపూజోత్సవాలు
- గురువుల ఔన్నత్యాన్ని వివరించిన వక్తలు



ఎంపీడీఓ కార్యాలయంలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ



ఉపాధ్యాయులను సత్కరించిన పేరెంట్స్ కమిటీ



మూలపేటలో సత్కారం పొందిన ఉపాధ్యాయులతో నాయకులు



శ్రీప్రకాష్ సినర్జీలో కళారూపాన్ని ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయినులు

పెద్దాపురం: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఎంఈఓలు ప్రభాకర శర్మ, చౌదరి నివాళులర్పించారు. ఉపాధ్యాయులకు గుర్తింపు తెచ్చి రాష్ట్రపతిగా ఎదిగిన సర్వేపల్లిని ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. లావణ్య, మూర్తి, సీఆర్పీలు వీరబాబు, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ బత్తిన అశోక్‌కుమార్, కార్యాలయ ఏఓ సత్యనారాయణమూర్తి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

శ్రీప్రకాష్ సినర్జీలో..

స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో రాజమహేంద్రవరం, పెద్దాపురం, కాకినాడ బ్రాంచిలకు చెందిన ఉపాధ్యాయులతో నిర్వహించిన సభలో పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ అజ్ఞానపు చీకటిని తొలగించి జ్ఞానమునిచ్చే గురువులకు ఉత్తమ కీర్తిని తీసుకువచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ప్రతీ ఉపాధ్యాయుడు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రదర్శించి కళారూపాలు మైమరపించాయి. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, ఏఎస్ఎన్ మూర్తి, ప్రొఫెసర్ సంతానం, అధ్యాపక బందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులు కావాలి

సామర్లకోట: ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా కాలానుగుణంగా నైపుణ్యాన్ని పెంచుకోవాలని గణితావధాని, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఆయన నివాళులు అర్పించారు. సర్వేపల్లి జీవిత చరిత్ర విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలుసుకోవాలన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా కమిటీ సభ్యులు మాధవీదేవి, సప్పా ఆది నారాయణ, ఉపాధ్యాయులు వి రాజు, జి.గోవిందు, కె.అరుణ, ఏఎల్‌వీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

గురువులే నిజమైన మార్గనిర్దేశకులు

కొత్తపల్లి: తల్లిదండ్రుల తరువాత గురువులే నిజమైన మార్గనిర్దేశకులని జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్ అన్నారు. మండలంలో మూలపేటలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అమరవల్లిలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ పులి జయబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాలలోని ఉపాధ్యాయులను సత్కరించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

సామర్లకోట: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు కానుబోయిన విజయకృష్ణ అధ్యక్షతన డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి నివాళులు అర్పించారు. నేదునూరి మురళీకృష్ణ, బడేజాన్ సుభాకర్ చార్లెస్‌లను సత్కరించారు. క్లబ్ జిల్లా ఉప గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, జిల్లా అధ్యక్షుడు చిత్తూలూరి వీర్రాజు, రీజనల్ చైర్మన్ చిత్తూలూరి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



విశాఖపట్నంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకుంటున్న నాగులాపల్లి జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ వి.జగన్‌మోహన్



విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించిన లయన్స్ క్లబ్ సభ్యులు

ఉపాధ్యాయులకు ఉత్తమ పురస్కారాలు



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రాజశేఖర్









ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకుంటున్న ఆర్.విమలకుమారి, ఎంసీహెచ్ సాయిబాబా, సీహెచ్ఎస్ శంకర్, మహాలక్ష్మి

పిఠాపురం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు అవార్డులు అందుకున్నారు. గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేఎస్ఎస్ రాజశేఖర్‌ను ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయగా ఆయన విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గొల్లప్రోలు ఎంపీపీఎస్ ఎస్ఎస్ స్కూలు టీచర్ ఆర్.విమలకుమారి, గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఎంపీపీఎస్ హెచ్‌పీ స్కూలు ఉపాధ్యాయుడు ఎంసీహెచ్ సాయిబాబా, గొల్లప్రోలు బాలుర హైస్కూలు ఉపాధ్యాయుడు సీహెచ్ఎస్ శంకర్, పొన్నాడ శివారు కోనపాపపేట ఎంపీపీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న కుడుపైడి మహాలక్ష్మిలు కాకినాడలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిల చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

సత్యనారాయణకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

సామర్లకోట: స్థానిక యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం యు.సత్యనారాయణకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందజేశారు. ఈ మేరకు మంగళవారం కాకినాడలో కలెక్టర్ కృతికా శుక్లా ఆధ్వర్యంలో పురస్కారం అందజేశారు. ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

త్రిమూర్తులుకు జిల్లా ఉత్తమ పురస్కారం

మాధవపట్నం మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మంజు త్రిమూర్తులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కాకినాడలో కలెక్టర్ కృతికా శుక్లా ఆధ్వర్యంలో అందుకున్నారు. ఆయనను ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య అభినందించారు.





పురస్కారం అందుకుంటున్న త్రిమూర్తులు, హెచ్‌ఎం సత్యనారాయణ

ప్రైవేటు పాఠశాలపై ఈఓ పీఆర్డీ విచారణ

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: పీబీ దేవం ప్రైవేటు పాఠశాలపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి గతంలో ఏర్పాటు చేసిన ద్విసభ్య కమిటీ సభ్యులు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, ఈఓ పీఆర్డీ హిమమహేశ్వరి 11 తప్పులను గుర్తించినట్టు ప్రస్తుత ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి అన్నారు. 'ప్లాను లేదు.. పన్ను చెల్లించరు' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ, ఈఓ పీఆర్డీ విచారించాల్సి ఉంది. అయితే డీఎల్‌పీఓ ఎన్నికల విధులలో ఉండటంతో ఈఓ పీఆర్డీ ఒక్కరే పంచాయతీ కార్యాలయంలో విచారణ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, కార్యదర్శి రామ్‌నాథ్‌ల నుంచి వివరాలు సేకరించారు. త్రివర్ణ పబ్లిక్ స్కూల్ కొడా అనుమతులు లేకుండా నిర్మించడంతో పాటు పాఠశాలకు ఎన్ఓసీ లేదని వివరిస్తూనే, నిర్మాణంలో 11 తప్పులున్నట్టు అప్పటి కమిటీ ఇచ్చిన నివేదిక నకలును వారు ఎంపీడీఓ డి.శ్రీలలితకు అందజేశారు. స్కూల్ రెన్యూవల్‌కు అనుమతి ఇవ్వడానికి వీలులేదని 2020 లోనే పంచాయతీ తీర్మానం చేసినా అప్పటి ఎంఈఓ పంచాయతీ తీర్మానాన్ని లెక్క చేయకుండా రెన్యూవల్ చేశారని సూరిబాబు విచారణాధికారికి తెలిపారు. విచారణలో గుర్తించిన అంశాలను కలెక్టర్‌కు వివరిస్తానని విచారణాధికారి సత్యారెడ్డి తెలిపారు. డీఎల్‌పీఓ వచ్చిన తరువాత మరో పర్యాయం పూర్తి స్థాయి విచారణ చేస్తామన్నారు.



పీబీ దేవం పంచాయతీ కార్యాలయంలో సమాచారం సేకరిస్తున్న ఈఓ పీఆర్డీ సత్యారెడ్డి

అవ్వాతాతలను ఆదుకున్నది సీఎం జగన్ ఒక్కరే

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: అవ్వాతాతలను ఆదుకున్నది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మంగళవారం పిఠాపురం క్యాంపు కార్యాలయంలో కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత అవ్వాతాతలకు ప్రతీ నెలా ఒకటో తేదీ పండగ రోజుగా మారిందన్నారు. ఎటువంటి సిఫార్సులు లేకుండా పైసా ఖర్చు లేకుండా ఇంటి ముంగిటకే పథకాలు అందజేయడం చరిత్రలో ఎక్కడా లేదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక కొత్త పింఛన్ రావాలంటే కాటికాడ నక్కలా కాసుకు కూర్చోవలసి వచ్చేదని దుయ్యబట్టారు. పింఛన్ దారుడు ఎవరైనా చనిపోతేనే కొత్త పింఛన్ ఇచ్చేవారని, అది కూడా టీడీపీ జన్మభూమి కమిటీ చెప్పిన వారికే ఇచ్చేవారన్నారు. ఒకటో తేదీ కోడి కూయక ముందే పింఛన్లు ఇంటికి తెచ్చి ఇవ్వడం దేశంలోనే ఒక చరిత్ర సృష్టించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.



కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

కుటీర పరిశ్రమలకు ఆర్థిక అండ

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం

పిఠాపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా కుటీర పరిశ్రమలకు, కార్మికులకు ఆర్థికంగా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం 3వ సచివాలయం పరిధి 5వ వార్డులో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి పలు పథకాలను ప్రవేశపెట్టి అమలుచేస్తున్నట్లు తెలిపారు. నాయకులతో ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుడి ఖాతాలకు నిధులు జమ చేసిన ప్రభుత్వం తమ ప్రభుత్వమేనని వివరించారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఇంటి ముంగిటకే అందిస్తున్నామన్నారు. గతంలో ప్రభుత్వాలు మహిళలను, కార్మికులను పట్టించుకోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అమలుచేసి మాట నిలబెట్టుకుని అండగా నిలిచిందన్నారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని వార్డులు, గ్రామాల్లోనూ అనేక పనులు చేపట్టి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎటువంటి పైరవీలు, రాజకీయాలు లేకుండా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమం అందేలా చేసి అవినీతికి తావు లేకుండా చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పిఠాపురంలో స్థానికులకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమం

ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం : రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా మంగళవారం 9, 11 వార్డుల పరిధిలో పద్మనాభకాలనీలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఆ వార్డు కౌన్సిలర్లు పెంటకోట సత్తిబాబు, బలుసు కనకం, సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, ధర్మేంద్ర, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, నాగబోయిన రాజుబాబు, లక్కాకుల కృష్ణ, సుందరెడ్డి రాజు, ఎంపీటీసీలు శైల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు వింటున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

జగనన్న కాలనీ పనుల్ని నాణ్యతతో పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

సామర్లకోట: జగనన్న కాలనీ పనుల్ని నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు కృతికా శుక్లా అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోటలోని జగనన్న కాలనీ ప్రారంభోత్సవానికి రానున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుతో కలిసి ఆమె పనులను పరిశీలించారు. జగనన్న కాలనీలో ప్రధాన రోడ్లు, డ్రైన్లు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని హౌసింగ్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పనుల నాణ్యతకు ప్రాధాన్యమిస్తారన్నారు. కాలనీలో ఆర్చి గేటు వద్ద పూర్తి కాని ఇళ్లు పూర్తి చేసుకునే విధంగా లబ్ధిదారులకు, కాంట్రాక్టర్లకు సూచనలు ఇవ్వాలన్నారు. కాలనీలోని మౌలిక సదుపాయాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాలనీ వద్ద ఏర్పాటు చేసిన పార్కులో ఆడుకుంటున్న పిల్లలతో ముచ్చటించిన కలెక్టర్ ప్రతిఒక్కరూ బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్, డీఈ రాజ్‌కుమార్, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి, తహసీల్దార్‌లు ఎస్‌ఎల్‌వీ కుమారి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



జగనన్న కాలనీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, హౌసింగ్ చైర్మన్ దొరబాబు

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ల పంపిణీ



కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పద్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గణేశ్వరరావు



నాగమణికి పింఛను అందజేసిన వలంటీరు సుశీల

కాకినాడ ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత

పెద్దాపురం: సామాజిక పింఛన్ల పంపిణీని ప్రభుత్వం ఐదో తేదీ వరకు పొడిగించడంతో వయస్సు మీరిన వృద్ధులకు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు వలంటీర్లు వారున్న చోటకే వెళ్లి అందజేస్తున్నారు. మంగళవారం మండలంలోని పులిమేరు, చదలాడ వలంటీర్లు ఆళ్ల దుర్గా గణేశ్వరరావు, ఉండవల్లి లోకేష్ తమ పరిధిలోని పెన్షనర్లకు కాకినాడ, రాజమహేంద్రవరం ఆస్పత్రులకు వెళ్లి పింఛన్లు అందించారు. పులిమేరు సచివాలయం పరిధిలో గుడివాడ పద్మ అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు వలంటీర్ దుర్గా గణేశ్వరరావు అక్కడకు వెళ్లి పింఛను అందజేయగా, చదలాడ సచివాలయ పరిధిలో ఒబిలిశెట్టి వెంకటలక్ష్మీ చికిత్స పొందుతున్న రాజమహేంద్రవరం ఆస్పత్రికి వెళ్లి లోకేష్ పింఛను అందజేశారు.

సామర్లకోట: మండలంలోని 15వ సచివాలయం పరిధిలోని కోట్ని నాగమణి అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె వివరాలు తెలుసుకున్న వలంటీర్ ఉలవల సుశీల మంగళవారం కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి పింఛనును ఆమెకు అందజేశారు.